పైగామ్ ఎ హిదాయత్

సంపుటి: 4 సంచిక: 3 మార్చ్ 2016 వెల: 20/-

పర్యవేక్షకులు
మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

సంపాదకులు
ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

మీ సలహాలు, సందేహాలు, మరియు ఫిర్యాదుల కొరకు సంప్రదించగలరు

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony, Saidabad,
Hyderabad - 500059.
Phone: 9030557865
www.paighamehidayath.tk

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

విషయసూచిక

ఖుర్‌ఆన్ సందేశం
సూరే ఇఖ్లాస్ (5)

హదీస్ సందేశం
సోదరభావం–సానుభూతి (7)

ఆదర్శ జీవిత చరిత్ర
బదర్ సంగ్రామం (10)

నియమ నిబంధనలు
వజూ విధానము (13)

వనితావని
హజ్రత్ జైనబ్ (రజి) (17)

సమీక్ష
సత్యదర్పణం (19)

సందేహాలు–సమాధానాలు
రెండవ వివాహము (27)

ఫహ్‌రిస్తే మజామీన్

దర్సే ఖుర్‌ఆన్
సూరే ఇఖ్లాస్ 28

దర్సే హదీస్
బాహమ్ ముహబ్బతో మవద్దత్ 30

దర్సే సీరత్
జంగే బదర్ 33

దర్సే మసాయిల్
వజూ కే మసాయిల్ 35

గోషె ఎ ఖవాతీన్
హజ్రత్ జైనబ్ (రజి) 39

జవాబ్ హాజిర్ హై
హకీకత్ నుమా 41

సువాలో జవాబ్
దూస్రీ షాదీ కర్నా (48)

చరితార్థులు
హాజీ షరియతుల్లాహ్ 50

పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

ఖుర్‌ఆన్ సందేశం

సూరే ఇఖ్లాస్

మక్కా నగరములో అవతరింపబడిన ఈ సూరా లో 4 వచనములు ఉన్నాయి.

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ○

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

ఖుల్ హువల్లాహు అహద్ قُلۡ ہُوَ اللّٰہُ اَحَدٌ ۚ ①

(వారికి) చెప్పండి, అన్ని విధాలా అల్లాహ్ ఏకైకుడు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని అవిశ్వాసులు "మీ ఆరాధ్యదైవమైన అల్లాహ్ గురించి మాకు వివరంగా తెలపండి. ఆయన ఎలా ఉంటాడు? ఆయన వంశము, వంశ పరంపర ఏమిటి? ఆయన పూర్తి పరిచయం మాకు తెలుపండి అని కోరగా ఈ సూరా అవతరించింది. (రూహుల్ మఆనీ)

ఒక్కడు అనే పదాన్ని ఉపయోగించి అహద్ అనే అరబీ పదము యొక్క పూర్తి భావాన్ని తెలియజేయడం అసంభవం. ఒక్కడు అంటే ఎందులో ఒక్కడు? ఏ విషయంలో ఆయన ఒక్కడు? ఏ రకంగా ఆయన ఒక్కడు? ఇవేవీ ఒక్కడు అనే పదము ద్వారా మనకు తెలియవు. కాని అహద్ అనే పదము ఎంతటి లోతైనా భావాన్ని కలిగి ఉందంటే ఏ విధంగా చూసినా, ఆయన అస్తిత్వమును తీసుకున్నా, ఆయన ఉనికిని గురించి మాట్లాడుకున్నా, ఆయన గుణస్వాభావాల పరంగా చూసినా, ఇలా ఏ రకంగా చూసుకున్నా, ఎన్ని కోణాల నుండి చూసిన ఆయన మాత్రం ఏకైకుడు. ఆయన ఉనికిలోగాని, ఆయన గుణాలలోగాని, శక్తి సామర్థ్యాలలో గాని ఆయనను పోలిన వారు ఎవ్వరూ ఉండరు. ఆయనకు ఆయనే సాటి. ఇంతటి లోతైన భావాన్ని కలిగి ఉన్న అహద్ అను పదానికి సరిపడ పదము మరొకటి లేక అన్ని విధాలా ఆయన ఏకైకుడు అని అనువదించి దాని భావాన్ని తెలిపే ప్రయత్నం చేశాము.

అల్లాహుస్సమద్ اَللّٰہُ الصَّمَدُ ۚ ②

ఆయనే నిరాధారుడు, అక్కరలేనివాడు మరియు అందరూ ఆయనపైనే ఆధారపడి ఉన్నారు.

సాధారనంగా బేనియాజ్, నిరాధారుడు, అక్కరలేనివాడు ఇలాంటి పదాలతో అస్ సమద్ అనే అరబీ పదాన్ని అనువదిస్తారు. వాస్తవంగా చూస్తే ఈ పదాలన్నీ అస్ సమద్ యొక్క సగ భావాన్నే

వ్యక్తం చేస్తాయి. అస్ సమద్ యొక్క పూర్తి భావాన్ని వ్యక్తం చేసే పదము తెలుగులో లేదు. అస్ సమద్ అంటే కేవలం నిరాధారుడు, ఎవరి అక్కర లేనివాడు అని మాత్రమే కాదు. అస్ సమద్ లో రెండు కోణాలు ఉన్నాయి. ఒకటి ఆయనకు ఎవరి అక్కరా లేదు, ఇతరులతో ఆయనకు ఎటువంటి అవసరము లేదు. ఆయన పూర్తి నిరాధారుడు. అందులో ఉన్న రెండవ కోణం ఏమిటంటే అందరూ ఆయన పైనే ఆధారపడి ఉన్నారు. తమ అవసరాల్లో అందరూ అయన్నే ఆశ్రయిస్తారు. ఇలా అస్ సమద్‌లో ఉన్న రెండు కోణాలను తెలిపే తెలుగు పదము లేక అస్ సమద్ యొక్క భావార్థన్ని పైన వ్రాయబడింది.

లమ్ యలిద్ వలమ్ యూలద్ لَمْ يَلِدْ ۙ وَلَمْ يُوْلَدْ ۙ﴿٣﴾

ఆయనకు ఎటువంటి సంతానము లేదు. అయన ఎవరి సంతానము కాదు.

ఈ వచనములో దైవ దూతలను దేవుని కుమార్తెలుగా, హజ్రత్ ఈసా అలైహిస్సలామ్ లేదా ఉజేర్ అలైహిస్సలామ్ గార్లను దేవుని కుమారులుగా భావించే వారి భావనను అవాస్తవమని తెలుపుతూ దాన్ని ఖండించడం జరిగింది.

వలమ్ యకుల్లహూ కుఫువన్ అహద్ وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا اَحَدٌ ﴿٤﴾

మరియు ఆయనకు సరిసమానుడు ఎవ్వడూ లేదు.

అనగా ఏ విషయములోనూ ఆయనకు సమానుడు, ఆయనకు సహవర్తి ఎవ్వరూ లేదు. నాలుగు వచనాలు గల ఈ చిన్ని సూరాలో దేవుని యొక్క ఎకత్వాన్ని ఎంతో విస్తారముగా వివరించడం జరిగింది. మొదటి వచనములో పాలిథిజమ్ (అనగా బహుదైవారాధన) ను ఖండిస్తూ ఆయన ఏకేశ్వరుడన్న సత్యాన్ని తెలియజేయడం జరిగింది. రెండవ వచనములో అల్లాహ్‌ను విశ్వసించినప్పటికీ ఇతరులను తమ అవసరాలు, ఆక్కరులు తీర్చేవాడిగా భావించే వారిని ఖండించడం జరిగింది. మూడవ వచనములో దేవునికి కుమారులు లేదా కుమార్తెలు ఉన్నారని విశ్వసించే వారిని ఖండించడం జరిగింది. అలాగే నాల్గవ వచనములో దేవుని స్వభావములో, శక్తిసామర్థ్యాలలో ఇతరులను సాటికల్పించే వారిని ఖండించడం జరిగింది. ఈ విధంగా ఈ చిన్ని సూరాలో అన్ని రకాల షిర్క్‌ను ఖండించి, దేవుని ఏకత్వాన్ని చాటి చెప్పడం జరిగింది. అందుకే ఈ సూరాను సూరయే ఇఖ్లాస్ అంటారు. ఒక సహీ హదీసులో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ సూరాను ఖుర్ఆన్ యొక్క 1/3వ భాగముగా పేర్కొన్నారు. ఎందుకంటే పూర్తి ఖుర్ఆన్‌లో ఎక్కువగా మూడు మౌలిక విశ్వాసాలను బోధించడం జరిగింది. తౌహీద్ "ఏకేశ్వరోపాసన"; రిసాలత్ "దైవ ప్రవక్తల ఆగమనం" మరియు ఆఖిరత్ "పరలోక జీవితం". మరి ఈ సూరాలో ఈ మూడు మౌలిక విషయాల నుండి తౌహీద్‌ను పరిపూర్ణంగా వర్ణించడం జరిగింది. ఈ సూరాను పఠించడం గురించి ఎన్నో ఘనతలు పలు హదీసులలో వివరించబడ్డాయి.

నోట్: పైన పేర్కొనబడిన హదీసులో ఈ సూరా పూర్తి ఖుర్ఆన్ యొక్క 1/3వ భాగముతో సమానము అని ఉంది. అందుకు కొంత మంది ఈ సూరాను మూడు సార్లు చదివిన వారికి ఒక ఖుర్ఆన్ చదివినంత పుణ్యం లభిస్తుందని భ్రమపడుతున్నారు. దాని అర్థం అది కాదు. ఇమామ్ నవవీ, హాఫిజ్ ఇబ్నే హజర్ లాంటి గొప్ప గొప్ప ముహద్దిసీన్‌లు ఇది కేవలం వారి అపోహ మాత్రమేనని పేర్కొన్నారు.

హదీస్ సందేశం

సోదరభావం–సానుభూతి, సహకారాలు

దైవ విశ్వాసుల్లో పరస్పరం ఎలాంటి ప్రేమానుబంధాలు ఉండాలి?

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశించారని హజ్రత్ నౌమాన్ బిన్ బషీర్ రజియల్లాహు అన్హు గారు తెలిపారు: ముస్లింలు పరస్పరం ఒండొకరిపై కరుణ, ప్రేమ, క్షమ, సానుభూతులు కలిగి ఉండడం లో మానవ దేహాన్ని పోలి ఉంటారు. దేహం లోని ఏ ఒక్క అవయవానికి బాధకలిగినా, దేహం లోని మిగతా అవయవాలు దానికి ప్రభావితమై ఆ బాధలో పాలుపంచు కుంటాయి. (బుఖారీ; ముస్లిం)

సంగ్రహణం: అంటే, నన్ను విశ్వసించేవారిలో పరస్పరం చక్కని సహాయ సహకారాలు, సానుభూతులు, హృదయపూర్వక ప్రేమానురాగాలు ఉండాలి. ఈ సంబంధాలను చూసేవారు, ఏ ఒక్కడు తాను కష్టాల్లో, బాధల్లో చిక్కుకున్నా మిగతా వారందరూ ఆ బాధను అనుభవిస్తున్నారని, తన కష్టాల్లో పాలుపంచుకుంటున్నారని అనుకోవాలి.

ఒకవేళ అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించామని చెప్పుకుంటున్నవారిలో ఈ భావన గనక లేకపోయినట్లయితే, పరిపూర్ణ విశ్వాస భాగ్యం వారికి ప్రాప్తం కాలేదని అర్థం చేసుకోవాలి. ముస్లింల ఈ సుగుణాన్నే పవిత్ర ఖుర్ఆన్ లో “రుహమాఉ బైనహుమ్” అన్న సంక్షిప్తపదాల్లో వర్ణించడం జరిగింది.

హజ్రత్ అబూ మూసా అష్అరీ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ విధంగా ఉపదేశించారు: “తోటి విశ్వాసులతో విశ్వాసుల సంబంధం ఒక పటిష్టమైన నిర్మాణ సామాగ్రిలా ఉండాలి. పటిష్టతకు పరస్పరం ఒకదానితో మరొకటి కారణభూతమవుతుంది. (పరస్పరం ఒకదానికొకటి కలిసిపోయిన కారణంగా గట్టిగా నిలబడగలుగుతుంది.) తరువాత దైవ ప్రవక్త మహనీయులు (విశ్వాసుల పరస్పర సంబంధం ఎలా ఉండాలో ఉదాహరించడానికి) తన చేతి వేళ్ళను మరోచేతి వేళ్ళలో జొప్పించి చూపించారు. (అంటే ఏమాత్రం సందు లేకుండా ప్రక్క ప్రక్కన ఇటుకలు పేర్చిన కట్టడంలా విశ్వాసులు పరస్పరం ఐక్యంగా ఉండాలని చూయించడం అన్నమాట).

(బుఖారీ; ముస్లిం)

పరస్పరం కుళ్ళు, కుట్ర, అన్యాయం, అనుమానాలు, అపనమ్మకాల పట్ల ఆక్షేపణ:

పైన చెప్పిన హదీసుల్లో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు, పరస్పరం సఖ్యతతో, ప్రేమానురాగాలతో, ఒకే దేహం, ఒకే ప్రాణం అన్నట్లుగా కలసిమెలసి ఐక్యంగా ఉండాలని ముస్లిములకు బోధించారు. అలాగే, దీనికి భిన్నంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు.

ఉదాహరణకు, ఒకరిపై ఒకరు అనుమానాలు, అవనమ్మకాలు కలిగి ఉండడం, దుర్భాషలాడుకోవడం, నంబంధాలు తెంచుకోవడం, ఒకరు కష్టాల్లో ఉంటే సంతోషించడం, ఒకరిని బాధపెట్టడం, వారి మనస్సును గాయపరచడం, ఒకరిపై అసూయాద్వేషాలు కలిగి ఉండడాన్ని చాలా తీవ్రంగా పరిగణించి, ఆక్షేపించారు. ఈ క్రమానికి సంబంధించినవే కొన్ని హదీసులు ఇలా ఉన్నాయి.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశించారని హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు గారు ఉల్లేఖించారు: "మీరు ఇతరుల విషయంలో అనుమానాలకు దూరంగా ఉండండి. ఎందుకంటే అనుమానం అతి పెద్ద అబద్ధం. మీరు ఇతరుల బలహీనతలేవో తెలుసుకునే ప్రయత్నం చేయకండి. గూఢచారుల్లా వారి రహస్యాలను, తప్పిదాలను సేకరించే ప్రయత్నం కూడా చేయకండి. ఒకరిని మించిపోవడానికి ఒకరు వృధా ప్రయాస పడకండి. పరస్పరం అసూయాద్వేషాలు, కుట్రలు చేసుకోకండి. ఎడమొఖం, పెడముఖంగా ఉండకండి. అల్లాహ్ దాసుల్లారా ! అల్లాహ్ ఆదేశం మేరకు పరస్పరం సోదరులుగా కలసిమెలసి ఉండండి. (బుఖారీ; ముస్లిం)

ఈ హదీసులో ఆక్షేపించబడిన విషయాలన్నీ పరస్పరం మానవుల హృదయాల్లో పగ, ప్రతీకారం, అసూయాదేషాలను పెంచిపోషించేవి. మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేసేవే.

అన్నిటికంటే ముందు దైవ ప్రవక్త మహనీయులు అనుమానం, కశంకల గురించి ప్రస్తావించారు. ఇదొక రకమైన అసత్య భ్రమ. ఈ రుగ్మతులకు లోనైనవారి పరిస్థితి ఎలా ఉంటుందంటే, ఎవరితోనైనా వారికి ఏ కొద్దిపాటి విభేదం తలెత్తినా, ఇక వారి ప్రతి విషయంలో, ప్రతి పనిలో వారికి దురభిప్రాయం దుష్టసంకల్పమే కనబడుతూ ఉంటుంది. కేవలం ఈ భ్రమ, అపనమ్మకాల కారణంగా వారిని గురించి ఏవేవో ఊహించుకోవడం, ఎన్నో లేని పోని విషయాలు కల్పించుకోవడం జరుగుతుంది.

సాధారణంగా దీని దుష్ప్రభావం సహజంగా భౌతిక చర్యలపై కూడా పడుతుంది. దీంతో ఎదుటి వ్యక్తి వైపు నుండి కూడా దానికి ప్రతిచర్య మొదలవుతుంది. ఈ విధంగా హృదయాలు బద్ధలవుతాయి. సంబంధాలు శాశ్వతంగా చెడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ హదీసులో అపనమ్మకాన్ని "అక్‌జబుల్ హదీస్" అని పేర్కొన్నారు. అంటే అన్నిటికన్నా పెద్ద అబద్ధం అన్నమాట. ఒకరికి వ్యతిరేకంగా అతనికి అసత్యాన్ని అంటగట్టడం ఎంత పెద్ద పాపమో ప్రతి ముస్లింకు స్పష్టంగా తెలుసు. అయినప్పటికీ ఒకరిపట్ల కుశంక, అపనమ్మకం కలిగి ఉండడాన్ని కొంత మంది అంత పెద్ద తప్పుగా భావించలేదు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అనుమానాన్ని ఓ పెద్ద అబద్ధం అనేకాకుండా, అన్నిటికంటే పెద్ద అబద్ధమని హెచ్చరించారు. మనసులో జన్మించే ఈ పాపం నోటితో పలికే అసత్యం కన్నా తక్కువేమీ కాదు.

ఈ హదీసులో అనుమానం, దురభిప్రాయాన్ని ఎంతటి చెడుగా, దుష్టగుణంగా చెప్పబడిందో, అలాగే మరో హదీసులో సదభిప్రాయాన్ని, సదుద్దేశాన్ని చక్కని ఆరాధన అని అభివర్ణించడం జరిగింది.

హుస్నుజ్జన్ని మిన్ హుస్నిల్ ఇబాదతి" (అబూదాఊద్; ముస్నదే అహ్మద్)

అనుమానం, దురభిప్రాయాల తరువాత ఈ

హదీసులో వ్రాయబడిన విషయాలు (అంటే, ఇతరుల బలహీనతలను వెతకడం, ఇతరుల లోపాలను, తప్పిదాలను రహస్యంగా సేకరించడం, ఇతరులను మించిపోవడానికి ప్రయత్నించడం, ఎవరైనా మంచి స్థితిలో ఉంటే వారిని చూసి అసూయపడడం, ఓర్వలేకపోవడం వగైరాలు..) ఈ దుర్గుణాలవల్ల మనసులో ఓర్వలేనితనం, పగ, ప్రతీకారాల బీజం మొలకెత్తుతుంది. దీంతో ఈమాన్ కోరే ప్రేమానురాగాలు, దయ, సానుభూతి, సహకార భావన, ఐక్యతలాంటి సుగుణాలు మచ్చుకైనా కానరాకుండా పోతాయి.

హదీసు చివరన, “దైవదాసుల్లారా ! సోదరుల్లా ఐక్యంగా ఉండండి” అని సెలవీయబడింది. అంటే పగ, ప్రతీకారాలు, ఓర్వలేనితనాన్ని పెంచిపోషించే ఈ దుర్గుణాల నుండి మీ హృదయాలను పవిత్రంగా, పరిశుద్ధంగా ఉంచనంతవరకు మీరు పరస్పరం సోదరుల్లా కలసిమెసి ఉండలేరు” అన్న అర్థం దీనిలో సూచనప్రాయంగా ఇమిడి ఉంది.

హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు గారి కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ విధంగా ఉపదేశించారు: “ఒక విశ్వాసి మరొక విశ్వాసికి సోదరుడు. కనుక అతనిపై ఎలాంటి దౌర్జన్యమూ చేయకూడదు. (మీ సహాయానికి అర్హుడైతే అతనికి సహాయం చేయాలి). అతణ్ని నిస్సహాయంగా వదిలేయకూడదు. అతణ్ని చులకనగా చూడకూడదు. అతడి పట్ల ఏహ్యాభావంతో ప్రవర్తించకూడదు. (ఎందుకంటే అతడి హృదయంలో దైవభీతి ఉందేమో, దాని కారణంగా అతను అల్లాహ్‌కు ప్రీతిపాత్రుడేమో ఎవరికి తెలుసు !). తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ మూడు సార్లు తమ హృదయం వైపు సంజ్ఞ చేస్తూ “తక్వా” (దైవభీతి) ఇక్కడ ఉంటుంది. అని సెలవిచ్చారు. (బాహ్య స్థితిని చూసి ఎవరినీ తక్కువగ అంచనా వేయకండి. అతను తన ఈ తక్వా కారణంగా దైవం దృష్టిలో గౌరవనీయుడు కావొచ్చు. అందుకని మీరు ఏ విశ్వాసినీ ఋహ్యాభావంతో చూడకండి). తోటి విశ్వాసిని నీచంగా చూడడం, అతని పట్ల ఏహ్యాభావంతో ప్రవర్తించడమొక్కటే చాలు ఓ మనిషిని చెడ్డవాడనడానికి. ఒక విశ్వాసికి చెందిన ప్రతి వస్తువూ మరో విశ్వాసికి ఎంతైనా పవిత్రమైనది. అతని ప్రాణం, అతని ధనం, అతని గౌరవం. (కాబట్టి అతని రక్తాన్ని చిందించడం, ధనాన్ని దోచుకోవడం, అతని గౌరవాన్ని భంగం కలిగించడం లాంటివన్నీ హరాం). (ముస్లిం)

సంగ్రహణం: తోటి విశ్వాసికి సహాయం అవసరమైతే, అతనికి సహాయం చేయడం ప్రతి విశ్వాసిపై ఉన్న అతని హక్కు అని ఈ హదీసు తెలియజేస్తోంది. అయితే అతను సత్యం పై నిలబడినవాడై, నిజంగానే పీడితుడై ఉండాలి.

మరొక హదీసులో, “మీ సోదరుడు పీడితుడైతే అతనికి సహాయం చేయండి. ఒకవేళ దుర్మార్గుడైతే దుర్మార్గాన్నుండి అతణ్ని రక్షించండి. దుర్మార్గాన్నుండి అతణ్ని కాపాడడమే అతనికి సహాయం చేయడం అంటే” అని సెలవీయబడింది.

మీ సలహాలు, సందేహాలు, మరియు ఫిర్యాదుల కొరకు సంప్రదించగలరు

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony, Saidabad,
Hyderabad - 500059.
Phone: 9030557865
www.paighamehidayath.tk

ఆదర్శ జీవిత చరిత్ర

బదర్ సంగ్రామము

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు, వారి అనుచరులు మక్కాలో ఉన్నంత వరకు శత్రుత్వం ఒక వైపు నుండే అంటే విగ్రహారాదకుల రూపంలో ఎదురుపడేది. కానీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు, వారి అనుచరులను తీసుకొని మదీనాకు వలస వచ్చిన తరువాత శత్రుత్వం మూడు వైపుల నుండి ఎదురుపడసాగింది. అంటే ఒక వైపు నుండి మక్కా లోని విగ్రహారాధకులు, మరో వైపు నుండి యూదులు, మూడోవైపు నుండి మదీనాలోని మునాఫిక్‌లు (పైకి ముస్లింగా నటించే అవిశ్వాసులు). యూదులు పక్కలో బల్లెమైనారు. మునాఫికీన్ పైకి ఇస్లాం స్వీకరించిన వారిలా నటిస్తూ లోలోపల శత్రుత్వం కలిగి ఉన్న వెన్నుపోటు స్వభావం కలవారు. ఇంకా మిగిలింది మక్కాలోని విగ్రహారాధకులు. వీరు మొదటి నుండి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిపై శత్రుత్వం ప్రదర్శిస్తూ వచ్చారు. వీరు అడపాదడపా ఇస్లాం స్వీకరించినవారిపై దౌర్జన్యానికి పాల్పడేవారు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు, వారి అనుచరులు ఈ ముప్పేట దాడుల వల్ల చాలా ఇబ్బందులపాలైనారు. ఈ కఠినమైన సమయానికి తెరదించుతూ ఇప్పటి వరకు ఓర్పు, సహనాలతో వారి దౌర్జన్యాలను సహిస్తూ వచ్చిన ముస్లింలను ఇక ఇస్లాం విరోధుల దౌర్జన్యాన్ని ఎదురించమని దైవం ఆదేశించింది. ఈ ఆదేశం లభించిన తరువాత తొలిసారిగా ముస్లింలు విరోధుల దుష్కార్యాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించారు. దీన్నే ఇస్లాంలో జిహాద్ మరియు ఖితాల్ అంటారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు స్వయంగా పాల్గొన్న యుద్ధాలను గజ్వా అంటారు. కేవలం వారి అనుచరులలో కొందరు వెళ్ళి యుద్ధం చేస్తే దాన్ని సరియ్యా అంటారు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మొత్తం 27 సార్లు కాఫిర్లకు విరుద్ధంగా పోరాడడానికి రంగంలోకి దిగారు. కాని అందులో 9 సార్లే యుద్ధం జరిగింది. మిగతా 18 సార్లు యుద్ధానికి ముందే కాఫిర్లు సంధికి సిద్ధం కావడంతో, లేదా వారు పారిపోవడంతో యుద్ధం చేయాల్సిన అవసరం రాలేదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తమ అనుచరులతో కలిసి చేసిన ఈ 9 యుద్ధాలలో బదర్, ఉహద్, ఖైబర్, హునైన్, ఖన్‌దఖ్ మరియు తబూక్ ముఖ్యమైనవి. ముస్లింలను హతమార్చడానికి, కాఫిర్లు వేలాదిసంఖ్యలో మదీనా పై దండెత్తగా అల్పసంఖ్యలో ఉన్న ముస్లింలు ఎంతో సాహసంగా, వీరోచితంగా పోరాడి, ఇస్లాం సంరక్షణ కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన యుద్ధాలు ఇవి. వారి ఈ అమర గాథలను చదివితే ఒక విశ్వాసి యొక్క ఈమాన్ వృద్ధిచెందుతుంది. విశ్వాసం,

ప్రేమ, త్యాగం అనే పదాలకు సరైన అర్థం తెలుస్తుంది. ఎంతో ప్రేరణ లభిస్తుంది. వారి ఈ వీరోచిత గాథలను వివరంగా వ్రాయలేముగాని వాటిలో ముఖ్యమైనవాటిని సంక్షిప్తంగా వ్రాస్తాము. వారి ఈ సాహసోపేత గాథలను పెద్ద పుస్తకాలలో తప్పక చదవండి అని ప్రతి ఒక్కరితో మనవి చేసుకుంటున్నాము.

అటు వెయ్యి–ఇటు మూడు వందల పదమూడు:

మదీనా నగరము, మక్కా మరియు షామ్ నగరాల మధ్యలో ఉంటుంది. మక్కాకు చెందిన అవిశ్వాసులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని, వారి అనుచరులని మదీనాలో ప్రశాంతంగా జీవితం గడుపుతుండడం చుసి సహించలేకపోయేవారు. లోలోపలే దహించుకుపోతుండేవారు. వ్యాపార నిమిత్తం మక్కా నుండి షామ్‌కు వస్తూ పోతూ దారిలో ఉన్న మదీనా నగరముపై దాడులు జరపడం, రాత్రి వేళ వారి పొలాలలో నిప్పంటించడం, పొలాల్లో మేస్తున్న వారి ఒంటెలను తీస్కెళ్ళిపోడం, అలా సాధ్యపడకపోతే కనీసం వాటిని చంపి ముస్లింలకు నష్టం కలిగించడం ఇలా వారి హృదయాల్లో రగులుతున్న ద్వేషపు అగ్ని జ్వాలలని చల్లార్చుకునేందుకు దొరికి ఏ అవకాశాన్ని వదులుకునేవారు కాదు. అంతే కాకుండా మదీనాలోని యూదులను, మునాఫిక్‌లను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేవారు. ఇంతలోనే వ్యాపార నిమిత్తము షామ్‌కు వెళ్ళిన అబూ సుఫియాన్ ద్వారా మక్కా వాళ్ళు పెద్ద మొత్తంలో యుద్ధ సామాగ్రిని తెప్పిస్తున్నారన్న సమాచారం అందింది. మక్కా వాళ్ళు ఏదో పెద్ద వ్యూహము రచిస్తున్నారన్న విషయం అవగతమైంది. ఇంకా చేతులు కట్టుకొని కూర్చొనివుంటే ముంచుకొస్తున్న ప్రమాదాన్ని స్వాగతించినట్లవుతుందని ప్రవక్త గారు ఇక వారిని షామ్ నుండి మక్కాకు వెళ్ళే దారిలో అడ్డుకొని యీ యుద్ధ సామాగ్రిని వశపర్చుకోవలసిందేనని తమ అనుచరులను తీసుకొని అటుగా బయలుదేరారు. అబూ సుఫియాన్ చాలా తెలివిగల వాడు. ముందు నుంచే ప్రవక్త గారి కదలికలు గమనిస్తూ తమకు సమాచారం అందించాలని గూఢాచారులను ఉంచాడు. ప్రవక్త గారు ఎటువంటి తయారీ చేయకుండా కొంత మందిని తీసుకొని దారి కాచారు. కాని అబూ సుఫియాన్ వేరే మార్గం ద్వారా తప్పించుకుని మక్కా వెళ్ళిపోయాడు. తప్పించుకునే ముంది యుద్ధ సామాగ్రిని దోపిడికి పాలుపడే అవకాశం ఉందని మక్కాకు వర్తమానము పంపాడు. ఇది తెలిసిన అబూ జహల్ కోపంతో ఊగిపోతూ మక్కాలోని యువకులను, యోధులను వెంటనే యుద్ధానికి తయారు చేశాడు. ప్రయాణానికి కావలసిన సామాను సరంజామా అంతా మక్కా వారు మనసు విప్పి విరాళంగా ఇచ్చారు. చివరికి వెయ్యి మంది మదీనా వైపుకు బయలుదేరారు. మదీనాకు దగ్గరలో బదర్ మైదానములో పడావు వేసుకున్నారు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు మూడు వందల పదమూడు మంది అనుచరులతో మంతనాలు జరిపారు. వారి వద్ద యుద్ధము చేయడానికి అవసరమైన ఖడ్గాలు, కవచాలు, గుర్రాలు ఏవీ లేవు. అందుకే వారి అభిప్రాయాన్ని తెలుసుకోవాలనుకున్నారు. దేవుని పై పూర్తి విశ్వాసము మరియు ప్రవక్త గారి పట్ల సంపూర్ణ విధేయత కలిగి ఉన్న వారి అనుచరులు ఈ విధంగా సమాధానమిచ్చారు: "మీరు ఏది సమంజసం అనుకుంటే అది చేయండి. మేము మీ ప్రతి ఆజ్ఞను సిరసావహిస్తాము. మీరు మంటల్లో దూకమని చెప్పినా మేము రెప్పపాటు ఆలస్యము లేకుండా

దూకేస్తాము. మీరు, మీ దేవుడు వెళ్ళి యుద్ధం చేసి రండి, మేము ఇక్కడే కూర్చొని ఉంటాము అని సమాధానమివ్వడానికి మేము మూసా అలైహిస్సలామ్ గారి అనుచరులలా కాదు". ఈ జవాబును విన్న తరువాత ప్రవక్త గారు ఎంతో సంతోషించారు. ఆ గుప్పెడు మందిని తీసుకొని బదర్ వైపునకు బయలుదేరారు.

చూసే వారికి శత్రువులు చాలా బలంగా కనిపించసాగారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు, వారి అనుచరులు చాలా దయనీయ స్థితిలో ఉన్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తమ అనుచరులను పంక్తులలో నిలబెట్టి తమ మనసంతా లగ్నం చేసి అల్లాహ్ ను ప్రార్థించడంలో లీనమైపోయారు. వారి ప్రార్ధనలను మన్నించి అల్లాహ్ తఆలా దైవదూతలను వారి సహాయానికి పంపించి, వారికి ఒక గొప్ప విజయాన్ని ప్రసాదించారు. ఈ విజయంతో మక్కా వారి హృదయాల్లో విశ్వాసుల పట్ల ఓ రకమైన భయము ఏర్పడింది. అలాగే ఇంటి దొంగలైన యూదులు, మునాఫిక్‌లు దారికొచ్చారు. ఫలిల్లాహిల్ హుజ్జతుల్ బలిగహ్...

మిగత యుద్ధాల వివరాలు పెద్ద పుస్తకాలను చదివి తెలుసుకోగలరు.

సందేహాలు సమాధానాలు

1. ఒక ప్రాంతపు ముస్లింలు రాత్రి మందు తాగడానికి అలవాటు పడి ఉన్నారు. వారు ఉదయాన ఫజర్ నమాజుకు కూడా వస్తారు. నమాజుకు వచ్చేటప్పుడు వారు గుసుల్ చేసి రావాలా?

జ: ఇస్లాంలో మత్తు పదార్థము ఏదైనా అది హరామ్ (నిషేధము). మత్తుపానియాలకు దూరంగా ఉండమని నూరే మాయిదా 90-91 వచనములలో ఆదేశించడం జరిగింది. మత్తుపానియాలు త్రాగేవారికి రేపు ప్రళయ దినాన అల్లాహ్ తీనతుల్ ఖబాల్ త్రాగిస్తాడని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తెలిపారు. వారి అనుచరులు తీనతుల్ ఖబాల్ ఏంటి అని ప్రశ్నించగా నరకవాసుల చెమట మరియు చీము అని తెలిపారు. (ముస్లిం; నసాయీ) మరొక హదీసులో ఇలా ఉపదేశించారు: మత్తుపానియాలు త్రాగే వారి నమాజులను అల్లాహ్ 40 రోజుల వరకు స్వీకరించడు. ఒక వేళ తౌబా చేసుకుంటే అల్లాహ్ క్షమిస్తాడు. తౌబా చేసిన తరువాత మళ్ళీ త్రాగితే అల్లాహ్ అతడి 40 దినాల నమాజులను స్వీకరించడు. మళ్ళీ తౌబా చేసుకుంటే అల్లాహ్ క్షమిస్తాడు. రెండవ సారి తౌబా చేశాక కూడా త్రాగితే అల్లాహ్ అతడి 40 రోజుల నమాజులు స్వీరించడు. ఒక వేళ మళ్ళీ తౌబా చేసుకుంటే అల్లాహ్ క్షమిస్తాడు. మూడవ సారి తౌబా చేసిన తరువాత కూడా అతడు త్రాగితే అల్లాహ్ అతడి 40 రోజుల నమాజులు స్వీకరించడు. ఇక అతడు తౌబా చేసినా క్షమించడు. అతడికి తీనతుల్ ఖబాల్ త్రాగిస్తాడు. (తిర్మిజీ; అబూదావూద్; నసాయీ)

కాబట్టి ఆ ప్రాంతపు ప్రజలు తమ అలవాటును మానుకోవాలి. దైవ భీతి, దృఢ సంకల్పము ఉంటే ఇది కష్టమేమీ కాదు. ఇక మీరు అడిగిన ప్రశ్నకు సమాధానము ఏమిటంటే మందు త్రాగడం వల్ల గుసుల్ వాజిబ్ కాదు. కాబట్టి ఉదయం నమాజుకు గుసుల్ చేసి రానక్ఖరలేదు. కాని వారు త్రాగే మత్తుపానియాలు అపరిశుద్ధమైనవి. అవి బట్టలకు గాని, నోటికి గాని లేదా ఇతర శరీర అవయవాలకు గాని అంటుకొని ఉంటే వారి నమాజు కాదు. నమాజుకు ముందు వాటిని శుభ్రం చేయక తప్పదు.

(మిగతా ప్రశ్నల సమాధానాలు పేజి 27లో)

నియమ నిబంధనలు

వజూ విధానము

నమాజుకు ముందు వజూ చేయడం వాజిబ్. అల్లాహ్ తాలా దివ్య ఖురాన్ లో ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నారు:

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا قُمْتُمْ إِلَى الصَّلَاةِ فَاغْسِلُوا وُجُوهَكُمْ وَأَيْدِيَكُمْ إِلَى الْمَرَافِقِ وَامْسَحُوا بِرُءُوسِكُمْ وَأَرْجُلَكُمْ إِلَى الْكَعْبَيْنِ

ఓ విశ్వాసులారా! మీరు నమాజు కొరకు లేచినప్పుడు మీ ముఖాలను, మీ చేతులను మోచేతుల వరకు కడుక్కోండి, (తడి చేతులతో) మీ తలపై మసాహ్ చేసుకోండి. మరియు మీ కాళ్ళను చీలమండలం వరకు కడుక్కోండి[1].

అలాగే దైవ ప్రవక్త (స) గారు ఇలా అన్నారు:

لا صلاة لمن لا وضوء له

వజూ చేయనివాడి నమాజే లేదు[2].

కాబట్టి ముందుగా వజూ విధానము తెలుసుకుందాం.

దైవ ప్రవక్త (స) గారు వజూ చేసే విధానం:

فأفرغ على يديه ثلاثا فغسلهما، ثم مضمض واستنثر ثم غسل وجهه ثلاثا، ثم غسل يده اليمنى إلى المرفق ثلاثا، ثم اليسرى مثل ذلك، ثم مسح برأسه، ثم غسل قدمه اليمنى ثلاثا، ثم اليسرى مثل ذلك ثم قال: رأيت رسول الله صلى الله عليه وسلم توضأ نحوا من وضوئي هذا

హజ్రత్ హుమ్రాన్ రహ్మ గారి కథనం ప్రకారం హజ్రత్ ఉస్మాన్ ర.జి గారు తమ రెండు చేతుల మీద నీళ్ళు పోసి వాటిని కడిగారు. ఆ తరువాత నోట్లో నీళ్ళు పోసి పుక్కిలించారు, ఆ తరువాత ముక్కులో నీళ్ళు తీసుకొని శుభ్రపరిచారు. తరువాత తమ ముఖాన్ని మూడుసార్లు కడిగారు, ఆ తరువాత తమ కుడిచేయిని మూడుసార్లు అలాగే ఎడమ చేతిని మూడు సార్లు కడిగారు. ఆ తరువాత తలపై మసాహ్ చేసి కుడికాలును మూడుసార్లు తరువాత ఎడమ కాలును మూడు సార్లు కడిగి ఇలా అన్నారు: "నేను మీ ముందు వజూ చేసిన విధంగానే దైవ ప్రవక్త (స) గారు వజూ చేస్తుండగా నేను చూసాను".[3]

ఇమామ్ బుఖారీ ర.హ్మ గారు ఇక్కడ హదీసును సంక్షేపించి వ్రాయడం వలన మరికొన్ని విషయాలు మన ముందుకు రాలేదు[4]. వాటిని ఇమామ్ బుఖారీ ర.హ్మ గారు వేరే చోట పెర్కొన్నారు. వాటిని కూడా

---

1. అల్ మాయుదా: 6; 2. ఇబ్నే మాజహ్: 1/40; 3. బుఖారీ: 1923; 4. హదీసును సంగ్రహించి వ్రాయడం ఇమామ్ బుఖారీ ర.హ్మ గారి అలవాటు. ఒకే చోట పూర్తి హదీసును చాలా అరుదుగా వ్రాస్తారు. ప్రతీ చాప్టర్‌లోనూ అవసరమైనంత భాగాన్ని మాత్రమే వ్రాసి మిగతా భాగాన్ని దానికి సంబంధించిన చాప్టర్‌లో వ్రాస్తారు. దీన్ని ముహద్దిసీన్‌ల (హదీసు పండితుల) పరిభాషలో **ఇఖ్తెసారుల్ హదీస్** అంటారు.

చూద్దాం.

వజూ ఆరంభంలో చేతులు ఎక్కడి వరకు కడగాలి?

فأفرغ على كفيه ثلاث مرار، فغسلهما

హజ్రత్ ఉస్మాన్ ర.జి గారు తమ అరచేతులపై నీళ్ళు పోసి వాటిని మూడుసార్లు కడిగారు[10]. ఈ హదీసు ద్వారా ఆరంభంలో అఱచేయి మాత్రమే కడగాలని తెలిసింది.

ఎన్ని సార్లు పుక్కిలించాలి, నాసాపుటమును కడగాలి?

ثم مضمض واستنثر ثلاثا

హజ్రత్ ఉస్మాన్ ర.జి గారు మూడు సార్లు పుక్కిలించారు ఆరువాత మూడు సార్లు నాసాపుటమును శుభ్రముచేసారు[11].

తలపై మసాహ్ ఎలా చేయాలి?

మసాహ్ అంటే తుడవడం, తడమడం, రుద్దడం . వజూలో మసాహ్ చేయడం అంటే తడి చేతులతో తలపై తడమటం.

ثم مسح رأسه بيديه، فأقبل بهما وأدبر، بدأ بمقدم رأسه حتى ذهب بهما إلى قفاه، ثم ردهما إلى المكان الذي بدأ منه

దైవ ప్రవక్త (స) గారు వజూ చేసే విధానాన్ని తెలుపమని ఓ వ్యక్తి హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నే జైద్ (ర.జి) గారిని కోరగా వారు అతడికి వజూ చేసి చూపుతూ తల పై మసాహ్ చేసి చూపించారు. వారు తమ రెండు చేతులతో తల ముందు భాగము నుండి మసాహ్ చేయడం ఆరంభించి మెడ వరకు చేతులు తీసుకెళ్ళి అక్కడి నుండి చేతులను మరులా వెనక్కి (ఎక్కడి నుంచైతే ఆరంభించారో అక్కడికే) తీసుకొచ్చారు[12].

చెవుల మసాహ్ ఎలా చేయాలి?

ثُمَّ مَسَحَ بِرَأْسِهِ وَأُذُنَيْهِ بَاطِنِهِمَا بِالسَّبَّاحَتَيْنِ وَظَاهِرِهِمَا بِإِبْهَامَيْهِ

చెవులు కూడా తలలోని ఒక భాగమేనని దైవ ప్రవక్త (స) గారు తెలిపారు[13]. కాబట్టి తలపై మసాహ్ చేసేటప్పుడు చెవులపై కూడా మసాహ్ చేయాలి. ప్రవక్త (స) గారు వజూ చేసే విధానాన్ని తెలుపుతూ దైవ ప్రవక్త (స) గారు చెవుల లోపలి భాగాన్ని తమ చూపుడు వేళ్ళతో, బైట భాగాన్ని (అనగా చెవుల వెనుక భాగాన్ని) బొటను వేళ్ళతో మసాహ్ చేసేవారని హజ్రత్ ఇబ్నే అబ్బాస్ ర.జి తెలిపారు[14].

తల, చెవులపై ఎన్ని సార్లు మసాహ్ చేయాలి?

فمسح برأسه وأذنيه فغسل بطونهما وظهورهما مرة واحدة

హజ్రత్ ఉస్మాన్ ర.జి గారిని వజూ విధానమును గురించి ప్రశ్నించగా వారు నీళ్ళు తెప్పించి వజూ చేసి చూపిస్తూ తమ తల మరియు చెవుల లోపలి భాగము, బైట భాగము పై ఒక్కసారే మసాహ్ చేసారని హజ్రత్ అబూ ములైకహ్ ర.అ గారు తెలిపారు[15].

మెడపై మసాహ్:

بدأ بمقدم رأسه حتى ذهب بهما إلى قفاه

హజ్రత్ ఉస్మాన్ ర.జి గారు తమ తల ముందు భాగం నుండి మసాహ్ చేయడం ఆరంభించి తమ రెండు చేతులను మెడ వరుకు తీసుకెళ్ళారు[16]. (వజూ పూర్తి చేసిన తరువాత దైవ ప్రవక్త (స) గారు ఇదే విధంగా వజూ చేసేవారని చెప్పారు).

10. బుఖారీ: 1/43; 11. బుఖారీ: 1/48; 12. బుఖారీ: 1/48; 13. ఇబ్నే మాజహ్: 1/152; 14. నసాయీ: 1/74; 15. అబూదావూద్: 1/26; 16. బుఖారీ: 1/48;

మరొక హదీసులో వుంది:

من مسح قفاه مع رأسه وقي الغل يوم القيامة

తలతోపాటు మెడపై కూడా మసాహ్ చేసేవాడు ప్రళయదినాన సంకెళ్ళ నుండి రక్షింపబడతాడు[17].

ఇవే కాకుండా మరెన్నో హదీసులలో మెడపై మసాహ్ చేసే ప్రస్తావన లభిస్తుంది[18]. వీటన్నిటి వెలుగులో మెడపై మసాహ్ చేయడం అభిలషణీయం అని తెలుస్తోంది. కాని కొందరు ప్రముఖ హదీసు గ్రంథాలలో దీనికి సంబంధించిన హదీసులు (వారికి) కనబడకపోయేసరికి మెడపై మసాహ్ చేయడం బిద్అత్ అని అపోహపడ్డారు. కాని వారు తెలుసుకోవలసింది ఏమిటంటే ప్రముఖ హదీసు గ్రంథాలలోనూ అలాగే ఇతర గ్రంథాలలోనూ మెడపై మసాహ్‌కు సంబంధించి ఎన్నో హదీసులు వున్నాయి. మేము వ్రాసిన మొదటి హదీసు కూడా ప్రముఖ హదీసు గ్రంథమైన సహీహ్ బుఖారీ లోనిదేనని గ్రహించగలరు. అలాగే మేము వ్రాసిన రెండవ హదీసు రెండవ శతాబ్దానికి చెందిన హజ్రత్ ఖాసిమ్ ఇబ్నే సల్లామ్ ర.అ[19] గారు ''కితాబుత్ తుహూర్'' (వజూకు సంబంధించిన హదీసుల పుస్తకం) అనే పేరుతో వజూకు సంబంధించిన హదీసులన్నీ ఒక చోట జమచేసిన పుస్తకము లోనిది. ప్రముఖ అహ్లే హదీస్ పండితులు అల్లామహ్ షౌకానీ ర.అ గారు "నైలుల్ అవ్‌తార్: 1/207" లో ఇదే హదీసును దీనికి సంబంధించిన ఇతర పలు హదీసులతో పాటు వ్రాసి వాటి వెలుగులో మెడపై మసాహ్ చేయడం సరైనదా కాదా? అని చర్చిస్తూ ఇలా వ్రాసారు:

وبجميع هذا تعلم أن قول النووي مسح الرقبة بدعة، وأن حديثه موضوع مجازفة

మెడపై మసాహ్ చేయడం బిద్అత్, దానికి సంబంధించిన హదీసు మౌజూ (కల్పితము) అన్న ఇమామ్ నవవీ ర.అ గారి వ్యాఖ్యానాలు ఊహాగానాలు మాత్రమే అని వీటన్నిటి ద్వారా రుజువుఅవుతుంది.

అలాగే హదీసు పరిసోధనలో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన గొప్ప హదీసు వక్త "అల్లామహ్ అబ్దుల్ హై లఖ్నవీ" గారు. వారి పరిసోధనలకు దేశ–విదేశ ధార్మిక పండితుల మధ్య ఎంతో విలువ వుంది[20]. వారు కూడా ఈ అంశం పై చర్చిస్తూ ఇలా వ్రాసారు:

فهذه احاديث قولية و فعلية قد دلت على ان لمسح الرقبة اصلا، فلا معنى لنفيه

ప్రవక్త (స) గారి ప్రవచనాలు, ఆచరణలతో

---

17. కితాబుత్ తుహూర్: 1/373; 18. ఉదా:– ముస్నదే అహ్మద్: 1/70; ముస్నదే అహ్మద్: 25/301; అబూదావూద్: 1/32; తహావీ: 1/30; తబ్రానీ: 19/180; బైహఖీ: 1/99......... 19. వీరి జననం 150వ హజ్రీ (ఇమామ్ బుఖారీ కన్నా 40 సంవత్సరాల ముందు). వీరు సుఫియాన్ ఇబ్నే ఉఐనా, హమ్మాద్ ఇబ్నే సలమహ్, హుషైమ్, అబ్దుల్లాహ్ ఇబ్నే ముబారక్ తదితర ప్రముఖ హదీసు పండితుల నుండి హదీసు పరిజ్ఞాన్నాని సంపాదించారు. ఇమామ్ షాఫయీ ర.అ, ఇమామ్ అబూయూసుఫ్ ర.అ మరియు ఇమామ్ ముహమ్మద్ ర.అ గారి వద్ద ఫిఖా చదివారు.; 20.20. ప్రముఖ అహ్లే హదీస్ పండితులు షేఖ్ అల్‌బానీ ర.అ గారు వారి పుస్తకాలలో పలు చోటల –ప్రత్యేకించి "అసలు సిఫతిస్ సలాత్: 1/335"– లో అలాగే అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరీ గారు తౌహ్ఫతుల్ అహ్వజీ లో వార్ని, వారి పరిసోధనలని ప్రశంసిస్తూ వ్రాసిన మాటలు కూడా దీనికి సాక్షాలు.

కూడిన ఈ హదీసులు మెడపై మసాహ్ చేయడం నిరాధారమైన క్రియ కాదని, దానికి మూలము (దలీల్) వుందని తెలుపుతున్నాయి. అలాంటప్పుడు దీన్ని తిరస్కరించడంలో అర్థము లేదు.

ఏమైనప్పటికీ మెడపై మసాహ్ చేయడం అభిలషణీయం (ముస్తహబ్), దాన్ని తిరస్కరించడం అజ్ఞానం లేదా మొండితనం. దీనికి సంబంధించి మరిన్ని విషయాలు తెలుసుకోవాలనుకుంటే అల్లామహ్ అబ్దుల్ హై లఖ్‌నవీ ర.అ గారు ప్రత్యేకించి ఈ అంశంపై వ్రాసిన "తొహ్ఫతుత్ తలబహ్ ఫీ మస్‌హిర్ రకబహ్" చూడగలరు. లేదా దీని సారాంశము వారి మరో పుస్తకము "సిఆయా ఫీ షర్‌హి మా ఫీ షర్‌హిల్ వికాయా: 1/177-179) లో చూడగలరు.

గమనిక: 1. మెడపై మసాహ్ కు సంబంధించి మేము వ్రాసిన మొదటి హదీసులో ప్రవక్త (స) గారు తలతోపాటుగా మెడపై కూడా మసాహ్ చేసారని వుంది. కాని కొన్ని హదీసులలో ముందు తలపై ఆ తరువాత చెవులపై ఆ తరువాత మెడపై మసాహ్ చేసినట్లు వుంది.[21] కాబట్టి రెండిటిలో దేన్నైనా అవలంభించవచ్చు. 2. రెండవ పద్ధతి అవలంభించినప్పుడు మెడపై దేనితో మసాహ్ చేయాలో హదీసులలో స్పష్టంగా రాలేదు. కాబట్టి దీనికి ఓ కచ్చితమైన విధానమంటూ లేదు. కాని ఫుకహా ర.హ్మ తల, చెవుల పై మసాహ్ చేసిన తరువాత అఱచేతుల వెనుక భాగంతో మెడపై మసాహ్ చేసుకుంటే మంచిదని అన్నారు. ఎందుకంటే మసాహ్‌కు అర్థం "తడి చేతులతో అవయవాన్ని తడమడం" (అల్ ఫిక్‌హుల్ ఇస్లామీ వ అదిల్లతుహూ: 1/371). మరి తలపై అఱచేతితో మసాహ్ చేయడం ద్వారా దాని తడి దాదాపుగా ఆరిపోతుంది. ఆ తరువాత మెడపై మసాహ్ చేయాలంటే మరులా చేతులను తడుపుకోవాలి లేదా అఱచేతి వెనుక భాగమున వున్న తడితో మసాహ్ చేసుకోవాలి. ప్రవక్త (స) గారు వజూకు సాధ్యమైనంత వరకు తక్కువ నీళ్ళను ఉపయోగించమని ఆదేశించారు. (ఇబ్నే మాజహ్: 1/147....) కాబట్టి మరులా చేతులు తడుపుకునే కన్నా అఱచేతుల వెనుక మిగిలి వున్న తడితో మసాహ్ చేసుకోవడం మిన్న.

ఇప్పటి వరకు వ్రాసిన విషయాలు కాకుండా వజూలో మరికొన్ని అభిలషణీయ కార్యాలను విద్వాంసులు ప్రామాణిక హదీసుల వెలుగులో పేర్కొన్నారు. వాటిని సంక్షిప్తంగా ఇక్కడ వ్రాయడం జరుగుతోంది.

1. సంకల్పం (బుఖారీ: 1/6)
2. ఆరంభములో బిస్మిల్లా పఠించడం(తిర్మజీ: 1/37;)
3. మిస్వాక్ చేయడం (బుఖారీ: 9/85)
4. గెడ్డములో ఖిలాల్ చేయడం (తిర్మిజీ: 1/44)
5. వేళ్ళ మధ్యలో ఖిలాల్ చేయడం (తిర్మిజీ: 1/57)
6. చివరిలో అష్హదు అల్లాఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లాషరీకలహూ వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహ్, అల్లాహుమ్మ-జ్‌అల్నీ మినత్తవ్వాబీన్ వజ్అల్నీ మినల్ ముతతహ్హిరీన్ చదవడం. (తిర్మిజీ: 1/77)[21]

---

21. ఉదా: ముస్నదే బజ్జార్: 10/355; అల్ మోజముల్ కబీర్: 22/49; 22. అల్ బద్‌రుల్ మునీర్ ఫీ తఖ్‌రీజిల్ అహాదీసి వాకిఅతి ఫీ షర్‌హిల్ కబీర్: 2/271-295 లో వజూలో ప్రతీ అవయవాన్ని కడిగేటప్పుడు అలాగే వజూ పూర్తైన తరువాత చదవ వలసిన వివిధ దువాలకు సంబంధించి పలు హదీసులు వ్రాయబడివున్నాయి. వాటిని కూడా చదవడం ముస్తహబ్‌గా పండితులు పేర్కొన్నారు.

వనితావని

హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా

హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా కారుణ్యమూర్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి పెద్ద కుమార్తె. ఆమె తల్లి హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా. హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు దైవ ప్రవక్తగా నియమింపబడక పది సంవత్సరాల ముందు మక్కా నగరములో జన్మించారు. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి వయస్సు 30 సంవత్సరాలు.

బాల్యం లోనే హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారి వివాహము వారి పినతల్లి కుమారుడు అబుల్ ఆస్ తో జరిగింది. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ప్రవక్తగా నియమింపబడిన వెంటనే హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారు ఇస్లాం స్వీకరించారు. అవిశ్వాసులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని, వారిని విశ్వసించిన ముస్లింలని బాగా హింసించడం ఆరంభించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి మరో రెండు కుమార్తెలు హజ్రత్ రుఖయ్యా మరియు హజ్రత్ ఉమ్మె కుల్‌సుమ్ రజియల్లాహు అన్హుమాల వివాహము అబూలహబ్ కుమారులతో ఆరోజుల్లోనే జరిగిపోయింది. కాని (బహుశ చిన్న వయసు కావడం వల్ల) వారిని అత్తారింటికి ఇంకా (కాపురానికి) పంపలేదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి దేహంలానే వారి మనసును కూడా గాయపర్చాలనే ఉద్దేశంతో అబూలహబ్ తమ కొడుకుల్ని పిలిచి ప్రవక్త సంతానమైన తమ భార్యలకు విడాకులివ్వమని ఆదేశించాడు. తండ్రి ఆదేశం ప్రకారం వారిద్దరు తమ భార్యలకు విడాకులిచ్చారు. అదే సమయంలో అవిశ్వాసులు అబుల్ ఆస్‌ను కూడా తమ భార్య అయిన జైనబ్ రజియల్లాహు అన్హా గారికి కూడా విడాకులు ఇవ్వాలని బలవంతం చేశారు. కాని ఆయన నిరాకరించారు. వారు హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హాను ఎంతో ప్రేమించేవారు, వారి పట్ల మంచిగా ప్రవర్తించేవారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు కూడా వారి సత్ప్రవర్తనను చూసి ఎంతో మెచ్చుకునే వారు. ఇటువంటి గొప్ప వ్యక్తిత్వం కల అబుల్ ఆస్ గారు అప్పటికి ఇంకా తమ పూర్వీకుల ధర్మాన్నే అవలంబించేవారు. చివరికి ఒక రోజు దైవాదేశం ప్రకారం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అకస్మాత్తుగా హిజ్రత్ చేసి మదీనాకు వెళ్ళిపోయారు. హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారు తమ అత్తారింట్లోనే ఉండిపోయారు.

రెండు సంవత్సరాల తరువాత అనగా హిజ్రీ రెండవ ఏట విశ్వాసులకు, అవిశ్వాసులకు మధ్య ఒక భీకర పోరాటము జరిగింది. బదర్ ప్రాంతములో జరిగిన ఈ యుద్ధంలో వెయ్యి మందికి పైగా అవిశ్వాసులు మదీనా మీద దండెత్తరాగా 313 మంది విశ్వాసులు వారికి ఎదురు నిలచి దేవుని సహాయముతో యుద్ధభూమిని తమ వశము చేసుకున్నారు. 70 మంది అవిశ్వాసుల ప్రముఖులు, సర్దారులు విశ్వాసుల చేతుల్లో బంధించబడ్డారు. వారిలో హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారి

భర్త అబుల్ ఆస్ కూడా ఒకరు. వారిని హ్రజత్ అబ్దుల్లాహ్ ఇబ్నె జుబేర్ రజియల్లాహు అన్హు గారు బంధించారు. విశ్వాసులను శాస్వతంగా చెరిపేయాలని వెళ్ళిన మక్కా వారు యుద్ధములో ఘోర పరాజయం పొంది విశ్వాసుల చేతిలో ఖైదీలుగా ఉన్నారని తెలుసుకున్న మక్కా వాసులు తమ వాళ్ళని విడిపించుకోవాలని పరిహార నగదుతో కొంత మందిని ప్రవక్త గారి సన్నిధిలోకి పంపారు. హ్రజత్ జైనబ్ రజియల్లాహు అన్హా వారు కూడా తమ భర్త అబుల్ ఆస్‌ను విడిపించుకోడానికి తమ మెడలో హారాన్ని తమ మరిది అదుర్ బిన్ రబీఅ్ కు ఇచ్చి పంపారు. అది హ్రజత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారి వివాహములో వారి తల్లి హ్రజత్ ఖదీజా రజియల్లాహు అన్హా గారు ఇచ్చిన హారము. ఆ హారాన్ని ప్రవక్త గారి సన్నిధిలోకి తీసుకురాగా ఒక్కసారిగా హ్రజత్ ఖదీజా రజియల్లాహు అన్హా గారిని గుర్తు చేసుకొని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు కన్నీరు పెట్టుకున్నారు.

తన సహచరులతో ఇలా అన్నారు: "ఇది జైనబ్ దాచుకున్న తమ తల్లి జ్ఞాపకం. మీకు సమంజసం అనిపిస్తే దీన్ని ఆమెకు తిరిగిచ్చేయండి. ఇక తమ ఆధీనములో ఉన్న అబుల్ ఆస్‌ను విడుదల చేయాలంటే ఒకటే పరిహారం. వారి ఆధీనములో ఉన్న జైనబ్‌ను వారు మదీనాకు పంపించేయాలి." సహచరులంతా దీనికి సమ్మతించారు. అబుల్ ఆస్ కూడా ఈ ఒప్పందాన్ని అంగీకరించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అబుల్ ఆస్ ను విడుదల చేసి వారితోపాటు హ్రజత్ జైద్ బిన్ హారిసా రజియల్లాహు అన్హును మక్కాకు పంపించారు. బతనే యాజజ్ అనే ప్రాంతంలో నిరీక్షించి జైనబ్ రజియల్లాహు అన్హా గారు అక్కడికి రాగానే వార్ని తీసుకొని మదీనాకు రమ్మని ఆదేశించారు. ఒప్పందం ప్రకారం అబుల్ ఆస్ మక్కా చేరుకోగానే తన సోదరుడు కనానా తో పాటు జైనబ్ రజియల్లాహు అన్హా గారిని మదీనాకు పంపించారు. ఈ విషయం కాస్త అవిశ్వాసులకు తెలిసింది. ముహమ్మద్ కుమార్తె ముహమ్మద్ వద్దకు వెళ్ళడానికి వీల్లేదంటూ వారిని వెంబడించారు. 'జీతువా' అనే ప్రాంతంలో వారిని ముట్టడించారు. ఒంటెపై వెళుతున్న జైనబ్ రజియల్లాహు అన్హా గారిపై అవిశ్వాసులలో ఒకడు హిబారా బిన్ అస్వద్ దాడి చేసి వారిని ఒంటె పైనుండి క్రిందకు పడేశాడు. ఆ సమయంలో నిండు గర్భిణిగా ఉన్న ఆమె ఆ దాడికి నేలకొరిగి తీవ్ర గాయాలకు గురికావడమే కాకుండా గర్భాన్ని సైతం కోలిపోయారు. వదినను ఈ దుస్థితిలో చుసిన కనానా నిప్పులు చిందడం మొదలుపెట్టాడు. తమ బాణాలను తీసి ఇక ఎవరైనా ముందడుగు వేయాలనుకున్నా అతడ్ని బాణాలతో జల్లెడపడతానని అన్నారు. అక్కడే ఉన్న అబూ సుఫియాన్ వారి క్రోధాన్ని చూసి కాస్త వెనక్కి తగ్గుతూ ఇలా అన్నాడు: "బిడ్డా ! నువ్వు బాణాలు ప్రయోగించకు. నేనొక మాట చెప్పదల్చుకున్నాను. ముందు అది విను". "చెప్పండి బాబాయి ! మీరు ఏమి చెప్పదల్చుకున్నారు?" అని రబీఅ్ అబూ సుఫియాన్‌తో అన్నాడు. అబూ సుఫియాన్ కనానా చెవిలో ఇలా అన్నాడు. "ముహమ్మద్ చేతిలో మేము పరాజయం పాలై ఎంతటి అవమానానికి గురయ్యామో నీకు తెలుసు. ఇప్పుడు ముహమ్మద్ కుమార్తెను ఇలా పట్టపగలు అందరి ముందు నువ్వు తీసుకెళితే మాకు ఎంత మండుతుంది. ఇప్పుడు నువ్వు జైనబ్ ను తీసుకొని తిరిగి మక్కాకు వెళ్ళిపో. కొద్ది రోజుల తరువాత రహస్యంగా ఆమెను మదీనాకు తీసుకెళ్ళు." కనానా వారి మాటను కాదనకుండా వదినను తీసుకొని తొరిగి మక్కాకు వెళ్ళిపోయారు. కొద్దిరోజులపాటు అక్కడే ఉండి ఒక రాత్రి రహస్యంగా ఆమెను తీసుకెళ్ళి బతనే యాజజ్ ప్రాంతంలో వారికొరకు నిరీక్షిస్తున్న హ్రజత్ జైద్ బిన్ హారిసా రజియల్లాహు అన్హుకు అప్పగించారు. చిన్నదనం నుండి ప్రవక్త గారి ఒడిలో పెరిగిన జైద్ బిన్ హారిసా హ్రజత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారిని సురక్షితంగా మదీనాకు తీసుకొచ్చారు. (వచ్చే సంచికలో....)

సమీక్ష

సత్యదర్పణం

ఈ మధ్య వినుకొండ ప్రాంతంలో క్రైస్తవ మిషనరీలకు సంబంధించిన వారు "సత్యదర్శనం" పేరుతో ఓ పుస్తకాన్ని ముస్లింల మధ్య పంచారు. అందులో కొన్ని విషయాలు ఇస్లాంకు వ్యతిరేకంగా ఉండడాన్ని గమనించి కొంత మంది మా సంస్థలో చదువుతున్న ఓ విద్యార్థి హాఫిజ్ జమీర్ ద్వారా మాకు ఆ పుస్తకాన్ని అందించి, ఇస్లాంకు విరుద్ధంగా వ్రాయబడ్డ విషయాల గురించి వివరణ కోరారు. ఈ పుస్తకాన్ని పరిశీలించి చూశాము. "పాపము దాని పరిహారము" అనే అంశంపై చర్చిస్తూ ఇందులో 16 నుండి 18 పేజీలలో ఇస్లాం గురించి కొన్ని విషయాలు వ్రాయబడి ఉన్నాయి. ఇన్‌షాల్లాహ్ ముందు వారి మాటలను ఆ తరువాత వాటి జవాబును మీ ముందు ఉంచుతాము

16 నుండి 18 పేజీలలో ఇలా ఉంటుంది:

మరి ఈ పాపం నుండి, నరకం నుండి బయటపడే మార్గం ఏది? ఈ పాపం నుండి విడుదల పొందడానికి మతాలు, మతగ్రంథాలు చెప్పిన మార్గాలు ఏమిటి?

ముందుగా **"ఇస్లాం మతంలో ముస్లిం సోదరులు ఏది నమ్ముతున్నారు?"** అని వారిని ప్రశ్నించి చూశాను.

నేను వారిని, "అయ్యా! మనిషి జన్మత: పాపి, కర్మల్లో కూడా పాపం చేస్తున్నాడు. ఆ పాపానికి ఘోర నరక శిక్ష ఉన్నది అని మత గ్రంథాలు ముక్త ఖంఠంతో సాక్ష్యమిస్తున్నాయి. మరి మీరు నమ్ముతున్న ఇస్లాం మత ధర్మంలో పాపం నుండి బయటపడి నరకాన్ని తప్పించుకోవాలి అంటే ఏం చెయ్యాలి?" అని అడిగాను. అందుకు వారు, వారేది నమ్ముతున్నారో అది చెప్పారు. అది ఏమిటంటే "మా మతంలో పాపాలన్నింటిలో అసలు పాపం, ముఖ్యమైన పాపంగా పరిగణించబడే పాపం, అల్లాహ్‌కు తప్ప ఇతర దేవతలకు మొక్కడం, వారిని అల్లాహ్‌తో సమానులుగా చేయడం. ఇదే పెద్ద పాపం, ఇది గాక మిగిలిన పాపాలు ఏవైనా అవి పాపాలుగా ఎంచబడవు" అని ఒకరు అన్నారు. ఇంకా మరొక ఆయన ఈ విధంగా అన్నారు, "ఒక పాపం మన ద్వారా జరిగినప్పుడు, ఆ పాపాన్నిబట్టి పశ్చాత్తాప పడితే పాపం పోతుంది" అన్నారు. అంతేకాదు, "మక్కాయాత్ర (హజ్‌యాత్ర) జీవితంలో ఒక్కసారైనా చేసివస్తే జీవితంలో చేసిన పాపాలు మొత్తం పోయి మోక్షం సిద్ధిస్తుంది" అని అన్నారు. ఇంకా ఏమన్నారంటే, "రోజా నమాజు చేయడం, ఉపవాసాలు పాటించడం, దానధర్మాలు చేయడం వలన కూడా పాపాలు పోతాయి" అని చెప్పారు.

నా మనస్సాక్షితో ధర్మానుసారంగా ఆలోచిస్తే పాపం పోగొట్టుకొని మనిషి మార్పుపొంది స్వర్గానికి చేరడానికి వారు చెప్పిన సంగతులు సరిపోవని నాకు అర్థమయ్యి, నేను వారిని ప్రశ్నించాను.

ఎందుకంటే **"దేవుడు ధర్మం తప్పకూడదు, న్యాయం తప్పకూడదు. అలా ధర్మం తప్పేవాడు దేవుడు కాజాలడు."**

కాబట్టి, వారు చెప్పినట్లు "పాపం చేసి పశ్చాత్తాపం పడితే, ఆ వ్యక్తిని దేవుడు విడిచిపెడతాడు" అనేది నిజమైతే మనిషి పాపం చేయడం మానేస్తాడా? ఇంకా చేస్తూనే ఉంటాడా? చేస్తూనే ఉంటాడు... ఎందుకంటే పశ్చాత్తాప పడితే పాపం పోతుంది కదా! అందుకనే మరలా నేను ఈ విధంగా అడిగాను, "అయ్యా! నేను ఒక వ్యక్తిని హత్య చేశాను. అతని కుటుంబం నాశనమైంది, ఆ తరువాత నేను పశ్చాత్తాప పడ్డాను, నమాజ్‌లు చేశాను, ఉపవాసాలు ఉన్నాను, హజ్ యాత్ర చేశాను, దానధర్మాలు చేశాను." ఇవన్నీ చేశానని దేవుడు నేను చేసిన దుర్మార్గాన్ని విడిచిపెడతాడా? ఒకవేళ విడిచిపెడితే నా వలన హత్యగావించబడిన వ్యక్తికి నాశనమైన అతని కుటుంబానికి దేవుడు ఏమని సమాధానం చెప్తాడు? అప్పుడు దేవుడు న్యాయస్థుడు అవుతాడా? (న్యాయస్థుడుకాదని భావము)

మరి న్యాయం ఏమిటి? "తప్పు చేసిన వాడిని శిక్షించడమే న్యాయం." ఈ సంగతి ముస్లిం సోదరులు ఆలోచించడం లేదు. ఇలానే పాపాలు పోతాయని గట్టిగా నమ్ముతున్నారు.

ఇది చదువుతున్న మీరు ఆలోచించండి. వారు నమ్ముతున్నది సమంజసమేనా ? పైన చెప్పినట్లు మనిషి ఒక్క పాపంతో ఆగడం లేదే. కొన్ని వేల లక్షల పాపాలు చేస్తున్నాడు. వాటికి న్యాయతీర్పు ఏమిటి?

సమీక్ష:

వీరి మాటలు చదివాక మనకు అర్ధమయ్యే విషయాలు ఏమిటంటే 1. మనిషి జన్మత: పాపి. అంటే వాడు పుట్టడమే పాపిగా పుడతాడు. 2. ఇస్లాంలో పాపాల పరిహారము కొరకు కేవలం తౌబా చేసుకుంటే లేదా నమూజు, రోజా తదితర పుణ్యకార్యాలు చేసుకుంటే చాలు. 3. పాపిని శిక్షించడమే న్యాయము, అతడ్ని క్షమించడం అధర్మము, అన్యాయము.

వీరు చెప్పిన ఈ మూడు మాటలు పచ్చి అబద్ధాలే. ఇన్‌షాల్లాహ్ మా సమీక్షలో మనిషి జన్మత: పాపి కాదు, ఇస్లాం ధర్మములో పాప పరిహారానికి కేవలం తౌబా సరిపోదు, అలాగే దేవుడు మానవుల పాపాలను క్షమించడం అన్యాయము కాదని మేము ఆధారాలతో సహా రుజువు చేస్తాము. కాని అంతకంటే ముందు మీరు తెలుసుకోవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. అవేమిటంటే:

1. క్రైస్తవ మిషనరీల వారు ఎప్పుడూ పాపము-పరిహారము అనే అంశం పైనే ఎందుకు చెబుతారు?

"ఈ పుస్తకములోనే కాదు ఏ పుస్తకము తీసుకున్నా క్రైస్తవులు ఎక్కువగా పాపము-పరిహారము అనే అంశం మీదే మాట్లాడుతూ కనిపిస్తారు, ఎందుకు?" ఎందుకంటే క్రైస్తవ మతము దీనిమీదే ఆధారపడి ఉంది. ఒక క్రైస్తవుడ్ని పట్టుకొని మీ ధర్మము ఏమి బోధిస్తుంది అని అడిగితే అతడు చెప్పే సమాధానము ఇదే "మన పాపాల కోసం ఏసు చనిపోయాడు, ఇది నమ్మిన వారి పాపాలు క్షమించబడతాయి, నమ్మని వారి పాపాలు క్షమించబడవు. నమ్మిన వారు స్వర్గానికి అర్హులవుతారు, నమ్మని వారు నరకములోకి వెళతారు". ఇంతకు మించి క్రైస్తవ ధర్మము బోధించేది ఏమీ లేదు. అందుకే క్రైస్తవ మిషనరీలు ఎప్పుడు పాపము-పరిహారము గురించే మాట్లాడుతారు.

2. జన్మతః పాపి సిద్ధాంతం:

ఎవరైనా ఇలా అనవచ్చు "నేను పాపిని కాను, నేను అసలు పాపాలే చేయను, కాబట్టి నాకు

